క్లుప్తంగా

ఓటు హక్కు వినియోగంపై కళాజాత



నెల్లిపాకలో కళాజాత ప్రదర్శన

ఎటపాక: ప్రజాస్వామ్యానికి ప్రతీక అయిన ఓటు హక్కు వినియోగంపై రెవెన్యూ శాఖ అధ్వర్యంలో శుక్రవారం కళాజాత కార్యక్రమాలు నిర్వహించారు. నెల్లిపాకలో జరిగిన అవగాహన కార్యక్రమంలో రాజమండ్రికి చెందిన విభూతి బ్రదర్స్ జానపద గీతాలు ఆలపిస్తూ, చలోక్తులతో ఓటు ఆవశ్యకతను వివరిస్తూ ప్రజలను చైతన్య పర్చారు.18 ఏళ్ల వయస్సు నిండిన ప్రతీ ఒక్కరూ ఈ నెల 15లోగా ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. తహసీల్దార్ శేఖర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీలో నారీశక్తి ఫిట్‌నెస్ రన్



ఖోఖో ఆడుతున్న బాలికలు

కొయ్యూరు: స్థానిక కేజీబీవీలో నారీశక్తి ఫిట్‌నెస్ రన్ కార్యక్రమాన్ని విశాఖకు చెందిన నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఇందులో 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు కలిగిన మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు సంపూర్ణ మాట్లాడుతూ మహిళ లు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. నిత్యం వ్యాయామం చేయాలని సూచించారు. టీషర్ట్‌లను పంపిణీ చేశారు. ఎన్‌వైకే కొయ్యూరు వలంటీర్ లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



కాలిపోయిన ఇంటి వద్ద బాధితురాలు

కొయ్యూరు: షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆడాకుల పంచాయతీ కిష్టారంలో శుక్రవారం ఓ తాటాకిల్లు దగ్ధమైంది. ప్రమాదంలో సర్వం కోల్పోయి బాధితురాలు పేగు చిన్నమ్ములు కట్టుబట్టలతో మిగిలింది. రూ.50 వేలు దాటి ఆస్తి నష్టం వాటిల్లినట్టు బాధితులు తెలిపింది. శుక్రవారం ఉదయం పది గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్ కావడంతో ఇంటిలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు చెప్పారు. అధికారులు స్పందించి ఆదుకోవాలని బాధితురాలు చిన్నమ్ములు కోరుతున్నారు.

సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన



లాగరాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం కళాకారులు

రాజవొమ్మంగి: సికిల్‌సెల్ ఎనీమియాపై ప్రజలకు కళాజాత ద్వారా వైద్య ఆరోగ్య శాఖ అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. ఇందులో భాగంగా మండలంలోని లాగరాయి పీహెచ్‌సీ వద్ద రాజమండ్రి విభూతి బ్రదర్స్ బృంద కళాకారులు సికిల్‌సెల్ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలను నాటిక రూపంలో ప్రదర్శన ఇచ్చారు. దీంతో పాటు మలేరియా, డెంగూ తదితర లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించు కోవాలని సూచించారు. కళాకారులు శ్రీనివాసరాజు, చిరంజీవి, వైద్య ఆరోగ్యశాఖ, మలేరియాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా నివారణకు చర్యలు



కాలువ వద్ద ఎబెక్ట్ ద్రావణాన్ని స్ప్రేచేస్తున్న సిబ్బంది

చింతపల్లి రూరల్: మలేరియా నివారణకు యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని చేపడుతోంది. మురుగు కాలువల్లో మలేరియా నివారణ మందు పిచికారీ పనులు చేపడుతున్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో ట్రైబల్ వెల్ఫేర్ క్వార్టర్స్ పరిసరాల్లోని కాలువల్లో ఎబెక్ట్ ద్రావణం స్ప్రేయింగ్ పనులు చేశారు. సీహెచ్ఓ డబ్ల్యూ పద్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛన్..పంచెన్



ఓగిపాలెంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది

- సచివాలయాల్లో సజావుగా పింఛన్ పంపిణీ
- గ్రామాల్లోనూ బట్వాడా
- అధికారుల ప్రత్యేక చర్యలు
- పరిష్కారమైన సాంకేతిక సమస్య

జి.మాడుగుల: జిల్లా వ్యాప్తంగా పింఛన్‌ల కోసం శుక్రవారం సజావుగా సాగింది. గడిచిన మూడు రోజులుగా పండుటాకులు పడిన కష్టాలకు తెరబడింది. సచివాలయాల్లో సిబ్బంది సక్రమంగా పెన్షన్‌దార్లుకు పెన్షన్ సొమ్మును అందించారు.ప్రతీ నెల మొదటి రోజునే పెన్షన్ సొమ్మును వలంటీర్లు అందించేవారని, కానీ ప్రస్తుతం పూర్తి స్థాయిలో అందించడంలో సాంకేతిక కారణాలతో కొంతమేర జాప్యం జరుతుందని వృద్ధులు చెప్పారు. మండలంలో గెమ్మెలి, సొలభం, గడుతూరు, వంజరి, పాలమామిడి, కె.కోడాపల్లి, లువ్వాసింగి, ఇతర పంచాయతీల్లో పలు గ్రామాల్లోని సచివాలయాల వద్ద పింఛన్ కోసం లబ్ధిదారులు శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పింఛన్ పంపిణీ సజావుగా సాగింది. కొన్నిచోట్ల గ్రామ సచివాలయం సిబ్బంది గ్రామాకు వెళ్లి పింఛన్ అందజేశారు. వలంటీర్లు అయితే ఎటువంటి సమస్య, ఇబ్బందులు లేకుండా నేరుగా ఇంటికే పెన్షన్ సొమ్మును అందించేవారని పెన్షన్‌దార్లు తెలిపారు. చంద్రబాబు కుట్ర రాజకీయాలకు విధుల నుంచి తొలగించిన వలంటీర్లను జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోని వచ్చిన వెంటనే వలంటీర్ వ్యవస్థను తీసుకొస్తానని హామీ ఇవ్వడంతో పెన్షనర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అనంతగిరి, హుకుంపేట, చింతపల్లి, రాజవొమ్మంగి తదితర ప్రాంతాల్లో పింఛన్ పంపిణీ శుక్రవారం సజావుగా జరిగింది.పెన్షన్‌దార్లుకు సకాలంలో పెన్షన్లు అందించటానికి అధికారుల తగిన చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో, సంబంధిత చర్యలు చేపడుతున్నారు.



బెన్నవరం సచివాలయంలో పింఛన్ పంపిణీ చేస్తున్న సిబ్బంది

వలంటీర్ వ్యవస్థ ఉండాలి



వలంటీర్ వ్యవస్థ అవసరం ఎంతైనా ఉంది. ప్రజలకు సేవలు అందించడంలో వారికి మించిన వారు లేరు. ఈ నెలలో పింఛన్ వలంటీర్లు పంచకపోవడంతో నా లాంటి వారు చాలా మంది వృద్ధులు అవస్థలు పడ్డారు. సచివాలయానికి వెళ్లి తీసుకోవడం కష్టంగా మారింది. ఇటు పింఛన్‌తో పాటు అటు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడంలో వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి మొదటి సంతకం వలంటీర్ల నియామకంపై పెడతామని చెప్పడం అభినందనీయం.

– **ఎస్‌కే మీరాబీ**, రాజేంద్రపాలెం, కొయ్యూరు మండలం

మళ్లీ జగనన్న వస్తేనే మా కష్టాలు తీరుతాయి



మళ్లీ జగనన్న ముఖ్యమంత్రిగా వస్తేనే మా కష్టాలు తీరుతాయి. గతంలో మా ఇంటి చెంతకే ఒకటో తేదీనే పింఛన్ అందిచేవారు. ఇప్పుడేమో అధికారుల, కార్యాలయాల చుట్టు తిరగాల్సి వస్తుంది. గత రెండు రోజుల నుంచి పింఛన్ కోసం సచివాలయాల చుట్టూ మండుటెండలో తిరిగితే గాని పింఛన్ అందుకోలేకపోయా. మళ్లీ జగన్నను గెలుపించుకోని వలంటీర్ ద్వారా ఇంటి వద్దనే పింఛన్ అందుకుంటాం.

– **పండయ్య**, పెంటపాడు గ్రామం, చింతపల్లి మండలం

పింఛన్ కష్టాలు వర్ణనాతీతం



సీఎం జగన్ ముఖ్యమంత్రిగా మళ్లీ అధికారంలోని వస్తే వలంటీర్ వ్యవస్థను మరింత బలోపేతం చేసి అమలుచేస్తామని హామీ ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. చంద్రబాబు కుటిల రాజకీయాల వల్ల ప్రస్తుతం పెన్షన్ కోసం రోజులు తరబడి పడిగాపులు కాస్తున్నాం . గతంలో ఇంటికి వలంటీర్ పెన్షన్ సొమ్ము తీసుకొచ్చి చేతికి ఇచ్చేవాడు. ఇప్పుడు దానికి భిన్నగా మారింది. దీన వల్ల మా పెన్షన్‌దార్లు కష్టాలు, ఇబ్బందులు వర్ణణాతీతం.

– **వంతాల రింగు**, గున్నమామిడి, జి.మాడుగుల మండలం

వలంటీర్లు లేక ఆలస్యం



ప్రతినెలా ఒకటో తారీఖున ఉదయమే వచ్చి వలంటీర్లు మాకు పింఛను ఇచ్చేవారు. చంద్రబాబు కుట్రతో వలంటీర్లను ఆపివేయడంతో నాకు ఐదో తారీఖున పింఛను వచ్చింది. వలంటీర్లు ఉండి వుంటే నాకు ఒకటో తారీఖునే పింఛను వచ్చేది. ఇప్పటికైనా వలంటీర్లే పింఛను ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– **సవలం ముత్తమ్మ**, పాలగూడెం, చింతూరు మండలం

గతం గుర్తుకొస్తోంది



ప్రస్తుత పింఛన్ల పంపిణీ వ్యవహారం గతంలో చంద్రబాబు పాలనను గుర్తుకు తెస్తోంది. ఈ నెలలో పింఛను కోసం ఐదు రోజులుగా ఎదురుచూస్తే శుక్రవారం అందించారు. చంద్రబాబు కుటిల రాజకీయాల వల్ల వలంటీర్ల సేవలు దూరం కావడంతో ఈ నెల సొమ్ములు రాలేదు. సిగ్నల్ లేదని చెప్పి ఇంత ఆలస్యం చేశారు.

–**కట్టం పెదఅక్కమ్మ**, పాలగూడెం, చింతూరు మండలం

వలంటీర్లతోనే మేలు



వలంటీర్లు ప్రతీ నెల అలస్యం లేకుండా నేరుగా ఇంటికి వచ్చి పింఛను అందజేశారు. కుటుంబ సభ్యుడిగా మెలిగారు. చంద్రబాబు చేసిన రాజకీయాల వల్ల వలంటర్ల సేవలు దూరమయ్యాయి. వలంటీరు వ్యవస్థతోనే మా లాంటి వృద్ధులకు సేవలు అందుతాయి. సీఎంగా జగన్ మళ్లీ అధికారంలోకి వచ్చి సేవలు అందిస్తారు. అందుకు మా వంతు సహాయం చేస్తాం.

– **నందూరి సుబ్బారావు**, ఇందుకూరుపేట

చంద్రబాబు కుట్ర రాజకీయాలకు బలి



నడవడమే కష్టంగా నాకు ఈ పరిస్థితుల్లో సచివాలయంలో వెళ్లి పింఛన్ డబ్బులు తీసుకోవాలంటే చాలా కష్టంగా ఉంది. మా పరిస్థితి తెలిసి కూడా సచివాలయాల్లో పింఛన్ సొమ్ము ఇస్తే ఎలా. చంద్రబాబు కుట్ర రాజకీయాలతో మా లాంటి వారందరు బలి అవుతున్నాం. చంద్రబాబుకు బుద్ధి చెప్పేందుకు సిద్ధం ఉన్నాం. జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అయి మా కష్టాలు తీరుస్తారు.

– **సమరెడ్డి రాజుబాబు**, హుకుంపేట

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించండి

ఎమ్మెల్సీ అనంతబాబు



వేటుకూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు

మారేడుమిల్లి: రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, అరకు ఎంపీ అభ్యర్థి తనూజరాణిలను ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ కోరారు. మారేడుమిల్లి మండలంలోజీఎం వలస, కుందాడ, వేటుకూరు, పాములేరు, కుట్రవాడ తదితర గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అనంత బాబు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ ఐదు సంవత్సరాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాల ద్వారా ప్రతీ ఒక్కరికీ రూ.2 లక్షల వరకు వారి వారి అకౌంట్లలో జమ అయ్యాయన్నారు. దేవరపల్లి, రామన్నవలస, సున్నంపాడు తదితర గ్రామాల పరిధిలో రూ.7 కోట్లకు పైగా సంక్షేమ పథకాల ద్వారా ప్రజలందరికి లబ్ధి చేకూరిందన్నారు.. అలాగే గ్రామాల్లో కూడా తాగునీరు అందించామని, రెతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్ల నిర్మాణంతో పాటు గ్రామ సచివాలయాలను అందుబాటులోకి వచ్చాయన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అరకు ఎంపీగా తనూజరాణి, రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మిలను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీపీ సార్ల లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీ బాబు, పార్టీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు గురుకు ధర్మరాజు, మండల కార్యదర్శి గంగరాజు, ఎంపీటీసీ సభ్యుడు అనిల్ , సర్పంచ్ లచ్చిరెడ్డి, పాల్గొన్నారు.

కూనవరం: మండలంలో శనివారం సాయంత్రం 3 గంటలకు ఎమ్మెల్సీ అనంతఉదయ భాస్కర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని మండల పార్టీ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపింది. పార్టీ నేతలు, గృహసారథుల పాల్గొనాలని పేర్కొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎం చేయడమే లక్ష్యం



వనభంగిలో గ్రామస్తులతో నాయకులు



అంబపడలో పర్యటిస్తున్న నాయకులు

పెదబయలు: జగనన్నను మళ్లి సీఎంను చేయడమే తమ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు పాంగి సింహాచలం, వైస్ ఎంపీపీ కొర్రా రాజుబాబు అన్నారు. మండలంలోని అరడకోట గ్రామ సచివాలయం పరిధిలోని అరడకోట, వనభంగి పంచాయతీల పరిధిలోని తోటలగొంది, కవేలబంధ, ఎగువ పేడాపల్లి, దిగువ పేడాపల్లి, పందిగుంట, బొంగదారి గ్రామాల్లో పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాలని కోరారు. స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు గడిచిగా గత ప్రభుత్వాలు చేయని అభివృద్ధి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కేవలం రెండున్నర ఏళ్లలోనే ఏజెన్సీ రూపురేఖలు మార్చారన్నారు. వనభంగి. అరడకోట, గలగండ, పెదకోడాపల్లి పంచాయతీలను అనుసంధానం చేస్తు రోడ్ల నిర్మాణం, ప్రతీ గ్రామానికి తాగునీరు అందించడం జరిగిందన్నారు. సంక్షేమ పథకాలను గడప వద్దకే అందించిన ఘనత జగన్ మోహన్ రెడ్డిదేనని అన్నారు. సామాజిక పింఛన్లు అవ్వా తాతలు, దివ్యాంగులకు పింఛన్లు ఇంటికి అందించకుండా చంద్రబాబు. పవన్ కళ్యాణ్‌లు ఫిర్యాదులు చేసి అడ్డుకున్నారన్నారు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామ సచివాలయాలకు కాలినడకన మండుటెండలో వెళ్లాల్సి వస్తోందన్నారు. దీంతో రానున్న ఎన్నికల్లో చంద్రబాబు, పొత్తుపార్టీలకు ఓటుతో గుణపాఠం చెప్పాలన్నారు. నాయకులు కొర్రా రాజుబాబు,వార్డు సభ్యులు బొండా నూకరాజు, కె లింగేష్, కామరాజు తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేయడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని మండల పార్టీ అధ్యక్షుడు పాంగి పద్మారావు అన్నారు. మండలంలో గల జర్జుల పంచాయతీ కేంద్రంతో పాటు అంబపడ ,టంకాపుట్టు, బాబుశాల పంచాయతీల్లో ఏడుకొండలబంధ, డముకులాడి గ్రామాలలో శుక్రవారం మండల వైఎస్సార్‌సీపీ నేతలు మేము సిద్ధం మా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని వివరించి, ఎంపీ అభ్యర్థి తనూజరాణి, ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యలింగంలకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని గ్రామస్తులను అభ్యర్థించారు. గ్రామాల్లో గిరిజనులు నేతలకు పూలమాలలు వేసి జై జగన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు పాంగి పద్మారావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీని గెలిపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రతి పేదవాడి గడపకు సంక్షేమాన్ని దరి చేరుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతోందన్నారు. గిరిజనులు ఎప్పుడు వైఎస్సార్‌సీపీ పక్షానే ఉన్నారని దీంతో గెలుపు తథ్యమన్నారు. సర్పంచ్‌లు పోర్తిమ, బంగారమ్మ, ఎంపీటీసీ పార్వతమ్మ, నేతలు అప్పారావు, జగబంధు, గృహసారథులు, కన్వీనర్లు కృష్ణారావు, గణపతి, జగన్నాథంపడాల్, కృష్ణమూర్తి, చంద్రరావు, జోగారావు, గోపాల్‌రావు, ఒచిత్‌లతో పాటు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల కార్యాలయాలు ప్రారంభం



మండల కేంద్రంలో ఎంపీ అభ్యర్థి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, నేతలు



ఎమ్మెల్యే అభ్యర్థి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న పార్టీ పరిశీలకురాలు హైమావతి, ఎమ్మెల్యే పాల్గుణ, చైర్‌పర్సన్ సుభద్ర, అభ్యర్థులు

అరకులోయ రూరల్: ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గ కేంద్రమైన అరకులోయలో వైఎస్సార్‌సీపీకి చెందిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల కార్యాలయాలను అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, నియోజకవర్గ పరిశీలకురాలు శోభ హైమావతి, విశాఖ ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు పరిశీలకురాలు వెంకటలక్ష్మి, అరకు పార్లమెంట్ అభ్యర్థి తనుజరాణి, అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగంలు కలిసి ప్రారంభించారు. ఎన్నికల్లో ఈ కార్యాలయాల సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. అరకు, డుంబ్రిగుడ మండలాల ఎంపీపీలు ఉషారాణి, ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యులు జానకమ్మ, శెట్టి రోషిణి, మండల పార్టీ అధ్యక్షులు లక్ష్మణ్‌కుమార్, మల్లేశ్వరావు, నాయకులు శెట్టి అప్పాలు ,ఏఎంసీ చైర్మన్ రాజారమేష్, యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్, యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, మహిళ విభాగ జిల్లా అధికార ప్రతినిధి రాధిక, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నర్సింగరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలి



హుకుంపేటలో పార్టీ శ్రేణులతో ఎంపీ అభ్యర్థి గుమ్మా తనూజారాణి



మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం, పక్కన ఎంపీ అభ్యర్థి తనూజారాణి

ఎంపి అభ్యర్థి తనూజరాణి

హుకుంపేట: వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమన్వయంగా పనిచేయాలని ఎంపీ అభ్యర్థి గుమ్మా తనూజరాణి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నాయకులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తనుజారాణి మాట్లాడుతూ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం మండల స్థాయి నాయకులు గ్రామస్థాయిలో సర్పంచ్‌లు, ఎంపిటీసీలతో పాటు కన్వినీర్లు, గృహసారథులు, వార్డు సభ్యులు కార్యకర్తలు సమన్వయంతో గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. ప్రతీ కార్యకర్త, నాయకులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పార్టీ యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్, మండల అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, జేసీయస్ మండల ఇన్‌చార్జి కె.రామకృష్ణ, సర్పంచ్‌లు కాదరి సురేష్‌కుమార్, సీదరి సాంబ, నాయకులు పాటి చిన్నయ్య, రాజరావు,చిన్నారావు,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలన మళ్లీ రావాలి

డుంబ్రిగుడ (అరకులోయటౌన్): మండలంలోని గసబ పంచాయతీ లోగిలి గ్రామంలో అరకు ఎంపీ అభ్యర్థి డాక్టర్ తనూజరాణి, అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యలింగం మాట్లాడుతూ మండలంలోని కొన్నేళ్లుగా నిర్మాణానికి నోచుకోని లోగిలి, కంద్రూం వంతెనలు జగనన్న ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత నిర్మించి ప్రజల కష్టాలు తీర్చారని, మరమ్మత్తుకు నోచుకోని రహదారులు కూడా పూర్తి చేశామన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండాలని సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చారని, రైతుల కోసం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. ఇన్ని సంక్షేమ పథకాలు అందించిన జగనన్నకు మళ్లీ పట్టం కట్టేందుకు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీగా తనూజరాణి, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి డాక్టర్ తనూజరాణి మాట్లాడుతూ తన మామయ్య చెట్టి పాల్గుణ ఎమ్మెల్యేగా డుంబ్రిగుడ మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. మీరంతా జగనన్న వెంట నడిచి, మరలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకురావాలని పిలుపునిచ్చారు.

ఘనంగా అమ్మవారి ఉత్సవాలు



బోడకొండమ్మ శాంభరీ దేవి

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలో కొలువై ఉన్న గ్రామదేవత బోడకొండమ్మ శాంభరీ దేవి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. నాలుగురోజులపాటు ఈ జాతర జరగనుంది. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. జాతర నాలుగురోజులు వినోద, కార్యక్రమాలు, క్రీడలు, థింసా తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కోసంగూడలో విద్యుత్ వెలుగులు



కోసంగూడ గ్రామంలో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభాలు

ముంచంగిపుట్టు: మండలంలో గల బంగారుమెట్ట పంచాయితీ కోసంగూడ గ్రామానికి 75 ఏళ్ల విద్యుత్ కష్టాలకు తెరపడనుంది. ఆరు కుటుంబాలకు చెందిన 32 మంది జనాభా కోసంగూడ గ్రామంలో నివసిస్తున్నారు. విద్యుత్ సౌకర్యంలో చీకటిలోనే జీవనం సాగిస్తూ వచ్చిన ఆ గిరిజన గ్రామానికి 10రోజుల్లో విద్యుత్ వెలుగులు రానున్నాయి. పంచాయతీ సర్పంచ్ రత్న, ఎంపీటీసీ కొండమ్మ, జేసీఎస్ కన్వీనర్ కొండలరావులు గ్రామ విద్యుత్ సమస్యను విద్యుత్‌శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై అధికారులు స్పందించారు. ఈ మేరకు గ్రామానికి విద్యుత్ సరఫరా కోసం బాదిపుట్టు నుంచి కోసంగూడ వరకు 32 విద్యుత్ స్తంభాలు, లైన్‌ల ఏర్పాటు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. దశాబ్దాలుగా వెంటాడిన విద్యుత్ సమస్య వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పరిష్కారమైందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

భానుడి భగభగలు



నిర్మానుష్యంగా ఉన్న రహదారి

రాజవొమ్మంగి: మండల పరిసరాల్లో శుక్రవారం భానుడు భగభగలాడాడు. ఎండ వేడిమికి తట్టుకోలేని ప్రజానీకం బయటకు రాకుండా ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో రోడ్లు, వీధులు నిర్మానుష్యంగా మారాయి. ఉక్కపోతతో పాటు వడగాల్పులు వీచాయి. ఉదయం నుంచి సాయంకాలం వరకు ఒకే మాదిరిగా ఉష్ణోగ్రతలు కొనసాగాయి. రాజవొమ్మంగిలో వేడిమికి అలమటించారు. పిల్లలు, వృద్ధులు ఎండ తీవ్రతకు బిక్కు బిక్కుమంటూ గడిపారు. ప్రతి సచివాలయం వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ యాదగిరీశ్వరావు సిబ్బందిని ఆదేశించారు. ఎండ వేడిమి ఎక్కువగా ఉన్నందున అత్యవసరం అయితే తప్ప ఇంటి నుంచి బయటకు రావద్దని స్థానిక తహసీల్దార్ సత్యనారాయణ సూచించారు. అస్వస్థతకు గురైన వారు నిమ్మరసం, ఎలక్ట్రాల్ పౌడర్ నీటిలో కలుపుకొని సేవించాలని సూచించారు. అవసరమైతే వైద్యుల సలహా పాటించాలని కోరారు.

ఆలయం పునఃప్రారంభం



నూకాలమ్మతల్లి విగ్రహం

పాడేరురూరల్(హుకుంపేట): మండలంలోని వంట్లమామిడి పంచాయతీ 12వ మైలురాయి జంక్షన్‌లో నూకాలమ్మతల్లి ఆలయాన్ని శుక్రవారం పున:ప్రారంభించారు. నూకాలమ్మతల్లి నూతన విగ్రహన్ని గిరిజనులంతా ప్రత్యేక పూజలతో ఘనంగా ఆవిష్కరించారు. సాయంత్రం వరకు నూకాలమ్మతల్లిని భక్తులు దర్శించుకున్నారు. మూడు రోజులు జరిగే జాతరకు గిరిజనులు ఏర్పాటు చేస్తున్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళి



అడ్డతీగలలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

అడ్డతీగల: బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఏపీ సీసీపీ కార్యదర్శి దంగేటి సత్తిబాబు ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు, కార్తకర్తలు పాల్గొన్నారు.

10 మద్యం సీసాలు స్వాధీనం

అనకాపల్లి: మద్యం బాటిళ్లను తరలిస్తున్న కశింకోట మండలం కొత్తపల్లి బుచ్చయ్యపేటకు చెందిన టి.వెంకటగణేష్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీస్‌స్టేషన్ హెచ్‌సీ డి.రామకృష్ణ తెలిపారు. పూల్‌భాగ్‌రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్రవాహనంపై వెంకటగణేష్ పది మద్యం సీసాలతో పట్టుబడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.